ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శనివారం 24 ఆగస్టు 2024

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య 6లో..

ధర్మపురిలో భక్తుల రద్దీ 7లో..

అటకెక్కిన అమృత్ 2.0

- రెండేళ్లుగా మురుగుతున్న రూ. 137.7 కోట్లు నిధులు
- పటిష్ఠం కాని తాగునీటి వ్యవస్థ
- ముందుకు సాగని కుళాయిల కనెక్షన్లు, ట్యాంకులు, నూతన పైపు లైన్‌ల నిర్మాణం



ఇబ్రహీంపట్నం మండలం డబ్బ గ్రామం వద్ద నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో తాగునీటి వ్యవస్థ పటిష్ఠం చేయడానికి కేంద్రం అమలులోకి తెచ్చిన అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫరేషన్) 2.0 పథకం అటకెక్కింది. ఎంపిక చేసిన పట్టణాల్లో తాగునీటి పథకాలను విస్తరించేందుకు గతంలో కసరత్తులు చేసినప్పటికీ రెండేళ్లుగా నిధులు నిరుపయోగంగా మారాయి. జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు, నూతన పైప్‌లైన్ల నిర్మాణం, కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి సుమారు రెండేళ్ల క్రితం కేంద్రం రూ. 137.7 కోట్ల నిధులను వెచ్చించింది. దీంతో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో మున్ముందు తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందన్న ప్రజల ఆశలు నీరుగారుతున్నాయి.

తొలి ప్యాకేజీలోనే నిధుల కేటాయింపు

అమృత్ 2.0 పథకంలో తాగునీటి సరఫరా మెరుగు పర్చేందుకు వరంగల్ పబ్లిక్ హెల్త్ డివిజన్ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో గల 30 మున్సిపాలిటీల్లో ప్యాకేజీ-1 కింద 1,745.08 కోట్ల నిధులను జీవో నంబరు 762 ద్వారా 2023 సెప్టెంబర్ 29న మంజూరైంది. దీనిలో భాగంగా జగిత్యాల జిల్లాలోని అయిదు మున్సిపాలిటీలను ఎంపిక చేసి రూ. 137.7 కోట్లు కేటాయించారు. అమృత్ పథకం కింద జగిత్యాల మున్సిపల్‌కు రూ. 38.60 కోట్లు, కోరుట్లకు రూ. 41.50 కోట్లు, మెట్‌పల్లి రూ. 19.40 కోట్లు, రాయికల్ రూ. 15.20 కోట్లు, ధర్మపురి మున్సిపల్‌కు రూ. 23.00 కోట్లు నిధులు కేటాయించారు. సంబంధిత నిధులతో పనులు పూర్తి చేయడానికి టెండర్లు నిర్వహించి అగ్రిమెంట్లు పూర్తయినప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదు. ఫలితంగా భవిష్యత్తు నీటి అవసరాలను తీర్చేందుకు, వందశాతం తాగునీటి భద్రత కల్పించేందుకు తోడ్పడే పథకం వినియోగంలోకి రావడం లేదు. కేంద్ర,రాష్ట్ర నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం, పట్టణ స్థానిక సంస్థల వాటాతో పథకం అమలు చేయాలని సంకల్పించినప్పటికీ ఆచరణలో నెరవేరడం లేదు.

లభించని శాశ్వత పరిష్కారం...

భవిష్యత్తు జనాభాను పరిగణలోకి తీసుకుని పైప‌లైన్లు విస్తరించడం, రిజర్వాయర్లు నిర్మించేందుకు అమృత్ 2.0 పథకం నిధులు ఉపయోగించుకునేలా ప్రజారోగ్యశాఖ ప్రతి పాదనలు చేసి ప్రభుత్వానికి పంపింది. మున్సిపాలిటీల్లో విలీన గ్రామాలు, శివారు కాలనీల్లో ఎండాకాలంలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. వచ్చే ఏడాది లోగా ఈ పనులన్నీ పూర్తి అయితే పట్టణాల్లో తాగునీటికి ఇబ్బందులు దూరం కానున్నాయని ఆశించినప్పటికీ నిరాశే ఎదురవుతోంది.

సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభిస్తాం

సంపత్, ప్రజారోగ్య శాఖ డీఈ, జగిత్యాల జిల్లా

అమృత్ 2.0 పథకం కింద జగిత్యాల మున్సిపాలిటీలో తాగునీటి వ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకుంటున్నాము. నూతన పైప్‌లైన్లు, ట్యాంకుల నిర్మాణం, మంచినీటి వసతుల పునరుద్ధరణ పనులు చేయనున్నాము. నూతన నిర్మాణాలతో కుళాయిలకు కనెక్షన్ ఇస్తాము. అమృత్ 2.0 పథకం కింద పనులు చేపట్టడానికి అవసరమైన టెండర్లు, అగ్రిమెంట్లు ఇటీవల ఈఎస్‌సీ స్థాయిలో పూర్తయ్యాయి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభిస్తాము.

తాగునీటికి కటకట...

జగిత్యాల జిల్లాలోని మున్సిపాలిటీలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 2,074 కిలో మీటర్ల మేర పైప్ లైన్ ఏర్పాటు చేసి 897 వాటర్ ట్యాంకులకు నీటిని అందిస్తున్నారు. జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణాల్లో సుమారు 2,26,385 ఇంటింటి నల్లా కనెక్షన్లకు నీటి సరఫరా చేస్తున్నారు. వివిధ కారణాల వల్ల పూర్తిస్థాయిలో నీరు రావడం లేదు. దీంతో స్థానిక బోర్ల నీటిని కలిపి సరఫరా చేస్తున్నారు. అది కూడా సమయపాలన లేకుండా జరుగుతోంది. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలకు నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. అమృత్ 2.0 పథకం ద్వారా కేంద్రం నిధులు కేటాయించడంతో మున్సిపాలిటీలే ట్యాంకు లు నిర్మించి, పైప్‌లైన్లను విస్తరించి తాగునీటి వసతి కల్పించనున్నాయని ఆశించారు. ట్యాంకుల నిర్మాణానికి మున్సిపాలిటీలో స్థలాలను కూడా ఎంపిక చేశారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేని దోరణి వల్ల పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

బతుకమ్మ చీరల పంపిణీకి చర్యలు తీసుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రానున్న బతుకమ్మ పండుగకు మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల బద్దంగా మహిళలు ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలను పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరమన్నా రు. బతుకమ్మ చీరల పంపిణీ వల్ల మహిళలకు లబ్ధి చేకూరడడంతో పాటు నేతన్నలకు ఉపాధి లభిస్తుందన్నారు. బతుకమ్మ చీరల తయారీ వల్ల హమాలీలు, ట్రాన్స్‌పోర్టు తదితర రంగాల వారికి సైతం ఉపాధి లభిస్తుందన్నారు. పని కరువై నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అంధ్రా ప్రాంతానికి చెందిన నేత రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తుండడం వల్ల తెలంగాణ సంస్కృతి అయినా బతుకమ్మ పండుగపై కనీస అవగాహన లేకపోవడంతో బతుకమ్మ చీరేల పంపిణీపై దృష్టి సారించడం లేదన్నారు. ఇప్పటికైనా బతుకమ్మ చీరల కోసం ఆర్డర్‌లు ఇచ్చి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మారు సాయిరెడ్డి, దారిశెట్టి రాజేశ్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సివిల్ సప్లయిస్ అధికారుల సోదాలు



కస్తూర్బా పాఠశాలలో సోదాలు నిర్వహిస్తున్న సివిల్ సప్లయి అధికారులు

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సివిల్ సప్లయి శాఖ కమిషనర్ కార్యాలయ ఆదేశాల మేరకు అధికారులు ఆకస్మికంగా విస్తృతంగా సోదాలు చేశారు. విద్యార్థులకు అందించే భోజనంలో వినియోగిస్తున్న బియ్యం, ఇతర పదార్థాలను పరిశీలించారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలతో పాటు మోతెలోని మైనార్టీ వెల్ఫేర్ హాస్టల్, రాయికల్ మండలం అల్లీపూర్ జడ్పీ హెచ్‌ఎస్, అయోధ్యలో గల అంగన్‌వాడీ కేంద్రాలలో పరిశీలన జరిపారు. బియ్యం, ఇతర పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పాఠశాలల్లో పరిశీలించిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ వర ప్రసాద్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రా జేంద్ర ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

వైద్యులతో కలెక్టర్ సత్య ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆసుపత్రులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆసుపత్రుల్లో అందిస్తున్న సేవలకు వసూలు చేస్తున్న ఫీజు వివరాలను పట్టిక రూపంలో ప్రదర్శించాలని, సాధారణ ప్రసవాలు పెంచడంపై దృష్టి సారించాలన్నా రు. ఆసుపత్రిలో అందుబాటులో ఆక్సిజన్, వెంటిలేటర్, ఇన్ పేషంట్ రూమ్స్ ట్రీట్‌మెంట్ చార్జేస్, ల్యాబ్ సేవలకు సంబంధించి వివరాలను, రుసులకు సంబంధించిన పట్టికను అందరికీ కనిపించే విధంగా తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని పలు ఆసుపత్రులు నిబంధనల ను అతిక్రమించి బయో వ్యర్థాలను మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనాల్లో వేస్తున్నారని, వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. ఆసుపత్రులను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, నిబంధనలను అతిక్రమిం చిన ఆసుపత్రులపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లా అత్యధికంగా సిజేరియన్‌లు నిర్వహిస్తున్న జాబితాలో అగ్రంగా ఒకటిగా ఉందని, సిజేరియన్‌లను 60 శాతానికి తగ్గించి సాధారణ ప్రసవాలు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డెంగ్యూ, వైరల్, టైఫాయిడ్ తదితర జ్వరాలు, ప్రసవాలకు సంబంధించిన వివరాలను ప్రై వేటు ఆసుపత్రుల నిర్వాహకులు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సమీయోద్దిన్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం - 2024పై జరిగిన చర్చావేదిక

పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఆడిటోరియంలో శుక్రవారం ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం - 2024పై చర్చావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు అధికారులు, నిపుణులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ఉద్యోగులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ప్రముఖులు హాజరై తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. కలెక్టర్ సత్య ప్రసాద్‌తో పాటు జిల్లాలోని మెట్‌పల్లి ఆర్‌డీవో శ్రీనివాస్, రిటైర్డు జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి, రిటైర్డు తహసీల్దార్ గంగారాం, న్యాయవాది మహేందర్, సీనియర్ సిటిజన్ హరి అశోక్ కుమార్, సర్వేయర్ కుమార స్వామి, రైతు శంకర్, జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వకీలు, టీఎన్‌జీవో అధ్యక్షుడు శశిదర్ హాజరై అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనుషులకు ఆధార్ కార్డు ఎలాగో భూములకు భూదార్ కార్డు అని, చట్టం అనేది రైతులకు చుట్టంలా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్‌డీఓలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు

హర్షం ప్రకటించిన గ్రామస్థులు



గ్రామస్థులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న కృష్ణారావు

కోరుట్ల రూరల్, ఆగస్టు 23 : మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలోని ఎల్లమ్మ చెరువు మరమతులు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 41.40 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను జువ్వాడి కృష్ణారావు గ్రామస్థులకు శుక్రవారం అందజేయగా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ శివారులోని ఎల్లమ్మ చేరువుతో పాటు పంట పొలాలకు నీరు అందించే మాటు కాల్వ గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో చెడిపోగా ఇటీవల వాటి అంచనాలను సంబంధిత అధికారులతో అంచనాలను వేసి ప్రభుత్వానికి అందించారు. వాటి మరమ్మ తులకు నిధులు మంజూరు చేసినట్లు కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయి నాయకులు అర్మూరి గంగాధర్, బోల్లే నర్సయ్య, లక్ష్మారెడ్డి, ఎండి రైమ్, రహీం, శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

సారంగాపూర్, ఆగస్టు, 23 : నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రూ, 33 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఫోన్‌లో విలేకరులకు వివరాలను తెలిపారు. సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గౌడ సంఘ భవనం నిర్మాణానికి రూ, 3లక్షలు, అంతర్గాంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం, రూ, 4 లక్షలు, కొల్వాయిలో యాదవ కాలనీ సాగునీటి సరఫరాకు రూ, 5 లక్షలు, ఇటిక్యాలలో తాగు నీటి బోరు మోటరు ఏర్పాటుకురూ, 1.50 లక్షలు మైతాపూర్‌లో దుర్గాదేవి ఆలయ సీసీ రోడ్డు రేలింగ్ నిర్మాణానికి రూ, 4 లక్షలు, రేచపల్లిలో ఎస్సీ (మాల) కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ, 3 లక్షలు, జగిత్యాలలోని గోవింద్‌పల్లి కాలనీలో పోచమ్మ ఆలయానికి ప్రహరీ నిర్మాణానికి రూ, 3 లక్షలు, మెతేలో ఎస్సీ కమ్యూనిటీ భవనంకు రూ, 2 లక్షలు, ఇటి క్యాలలో ముస్లి మజీద్ వద్ద హైమస్ లైట్ ఏర్పాటుకు రూ,1.25 లక్షలు. తాటిపల్లిలో బోరు మోటరు ఏర్పాటుకు రూ, 2 లక్షలు. హస్నాబాద్‌లో బస్ షెల్టర్ నిర్మాణానికి రూ, 3 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయించండి

కలెక్టర్‌తో భేటీలో కోరుట్ల ఎమ్మెల్యే



కలెక్టర్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌తో ఎమ్మెల్యే బేటీ అయ్యారు. కోరుట్ల నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. పరిష్కారానికి అసవరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్దిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 23: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్ర వారం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లబ్దిదారులకు సీఎంఆర్ ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన చెక్కులను పంపిణీ చేశారు. అదే విధంగా ఇటీవల ఏఈ ఉద్యోగం సాధించిన వేము లకుర్తి గ్రామానికి చెందిన రాజును ఎమ్మెల్యే అభినందించి శాలువాతో సత్కరించారు. మండలంలోని వర్షకొండ గ్రామంలోని జడ్పీ పాఠశాలలో సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని గర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా విగ్రహాన్ని పరిశీలించారు. ఇలాంటి మళ్లీ పునరావృతం కాకుండ కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎలాలా దశరత్‌రెడ్డి, నాయకులు లక్ష్మరెడ్డి పాల్గొన్నారు. .

తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు

- రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న క్రయవిక్రయదారులు

మల్యాల, ఆగస్టు 23: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయవిక్రయదారులు మల్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడ్డారు. జగిత్యాలలో ధరణిపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ జరుగగా అక్కడకు తహసీల్దార్ ఇతర రెవెన్యూ అధికారులు వెళ్లడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కొన్ని రోజుల ముందు గానే అభిప్రాయ సేకరణకు సంబంధించి కార్యక్రమం ఖరారైంది. దీంతో వ్యవసాయ భూములకు సంబంధించి శుక్రవారం నాటి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసే అవకాశం ఎవరికీ ఇవ్వకపోవడంతో ఉదయం వచ్చిన వారంత సాయంత్రం వరకు వేచి ఉన్నారు. తరచూ అధికారులకు ఫోన్లు చేశారు. ఆలస్యం పట్ల దూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు అసౌకర్యానికి గురి కాగ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అందుబాటులో లేనప్పుడు ముందు రోజే స్లాట్ బుకింగ్ రద్దు చేయాల్సి ఉండేదని మండిపట్టారు. తరువాత సాయంత్రం నాలుగు గంటల సమయంలో వచ్చిన తహసీల్దార్ రిజిస్ట్రేషన్లు చేసినట్లు పలువురు తెలిపారు. రాత్రి ఏడు గంటల వరకు అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ విషయమై కార్యాలయ అధికారులను సంప్రదించగా కలెక్టరేట్‌లో సమావేశం ఉన్నందున వెళ్లామని అందుకే ఆలస్యం అయినట్లు తెలిపారు.

కుండీల్లో నీటిని తొలగించాలి

మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, ఆగస్టు 23(ఇబ్రహీంపట్నం): ఇంట్లో, ఇంటి పరిసరాల్లో కుండీల్లో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికుప్పుడు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పదవ వార్డులలో ఫ్రైడే డ్రై డే సందర్భంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు. రోడ్లపై ఉన్న కుండీలలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కమి షనర్ మాట్లాడుతూ ప్రజలు ఇళ్లలో ఉన్న కుండీలలో నీరు నిల్వ ఉంచ వద్దన్నారు. నీరు నిల్వ ఉంచితే అంటీ లార్వా తయారై డెంగ్యూ వ్యా ధులు వ్యాపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

మల్చింగ్ విధానంపై రైతుల ఆసక్తి



పాలథీన్ కవర్లు ఏర్పాటు చేసిన దృశ్యం

మల్యాల, ఆగస్టు 23: పిచ్చి మొక్కలు, గడ్డి నివారణకు రైతులు మల్చింగ్ విధానంపై ఆసక్తి కనబరుస్తున్నారు. మండలం రాంపూర్ గ్రామంలో పలువురు రైతులు కొన్నాళ్లుగా కూరగాయల సాగు, అంతర పంటల సాగులో గడ్డి నివా రించడానికి పాలథీన్ కవర్లు పరుస్తున్నారు. ఎకరాల కొలది భూముల్లో కవర్లు పరచి అందులో రంధ్రాలు చేసి వాటిలో మిరప ఇతర కూరగాయల నారు వేసి సాగు చేస్తున్నారు. కవర్ల ఏర్పాటుతో గడ్డి పెరగకపోవడమే కాకుండా మొక్కలకు ఇబ్బందులు ఉండవని అధిక దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష పదవికి తొలి రోజు రెండు నామినేషన్లు

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల పట్టణ ఆర్య వైశ్యసంఘ అధ్యక్ష పదవికి జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి మోటూరి శ్రీనివాస్ తెలిపారు. పట్టణా నికి చెందిన పూటూరి నవీన్, యెర వెల్లి సురేశ్‌లు నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందించారని తెలిపారు. కాగా జగిత్యాలలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రి పర్యవేక్షించారు.

బదిలీపై వెళ్తున్న ఏఈవోకు సన్మానం

రాయికల్, ఆగస్టు 23: వ్యవసాయ శాఖ బదిలీలలో భాగంగా కొడిమ్యాల మండలం పూడూర్ క్లస్టర్‌కు బదిలీపై వెళ్తున్న ఇటిక్యాల క్లస్టర్ ఏఈవో రాజేష్‌ను మూటపెల్లి రైతులు శుక్రవారం సన్మానం చేశారు. ఆయన చేసిన రైతులకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏలేటి రాజేందర్ రెడ్డి, మంద రమేష్, కంటి గంగారాం, తోట రాజరెడ్డి, లచ్చన్న, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గొల్లపల్లి, ఆగస్టు 23: మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక (16) పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలిక జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. బాలికను తల్లిదండ్రులు కళాశాల వసతి గృహంలో ఉంచి చదివించేందుకు సిద్ధమయ్యారు. హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టపడని బాలిక ఇంట్లో నుంచి చదువుకుంటానని తల్లిదండ్రులకు తెలిపింది. అందుకు తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన బాలిక ఈనెల 21న పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తర లించగా మూడుల రోజుల అనంతరం పరిస్థితి విషమించి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

కథలాపూర్, ఆగస్టు 23: జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలికోటలో ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసి వృధాగా ఎందుకు ఖర్చు చేశా వంటూ తండ్రి మందలించినందుకు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...కలికోటకు చెందిన దరావత్ చరణ్ (16) ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం చదివి చదువు మానేసి వ్యవసాయ పనులు చేస్తున్నాడు. తండ్రి బాబు నాయక్ ఉపాధి పనులకు వెళ్లిన డబ్బులు ఖాతాలో జమ కాగా వెయ్యి రూపాయలు ఫోన్‌పే నుంచి డ్రా చేసుకుని చరణ్ ఖర్చు చేశాడు. దీంతో డబ్బులు ఎందుకు వృధాగా ఖర్చు చేశావని చరణ్‌ను మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. క్షణికావేశంతో ఊరి చివరన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి బాబు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్ తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 4,376 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నంది పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 419 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.302 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 23: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్‌ఆర్‌ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 18 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి 3,872 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 3,872 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మిడ్ మానేరుకు..

బోయినపల్లి, ఆగస్టు 23: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా 110 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 313.71 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.78 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా శనివారం నుంచి ఎల్‌ఎండీ పాజెక్టుకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువనున్న మానేరు వాగులో రైతుల మోటర్లు తొలగించుకోవాలని సూచించారు. వాగు పరిసర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

ఉపాధి నైపుణ్య శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

గణేశ్‌నగర్, ఆగస్టు 23: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.inలో ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎల్జీ హెప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకాలం పూర్తయిన తరువాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4000 చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొడుకును గల్ఫ్ నుంచి రప్పించాలి

- విదేశాంగ పీవోఈ అధికారికి తల్లి వినతి


పీవోఈకి విజ్ఞప్తి చేస్తున్న కుటుంబ సభ్యులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 23: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న తన కొడుకును స్వగామానికి రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ తల్లి హైదరాబాదులోని విదేశాంగ పీవోఈ అధికారికి వినతిపత్రం అందించింది. గల్ఫ్ మెడికల్ సెంటర్ నిర్లక్ష్యంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేసింది. మండలంలోని సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాదులోని ఎస్కే మెడికల్ సెంటర్ (గల్ఫ్ దేశం గుర్తించిన వైద్య కేంద్రం)లో వైద్య పరీ క్ష చేయించుకుని జూలై 11న ఉద్యోగ విసాపై సౌదీ అరేబియాలోని అల్ - బాద్ తాబూక్‌కు వెళ్లి ఓ కంపనీలో సూపర్ వైజర్‌గా చేరినట్లు తల్లి లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. వెళ్లే ముందు చంద్రశేఖర్‌కు ఫిట్‌నెస్ కోసం ఇచ్చిన టీకా వికటించిందని తన కుమారుడి చేతికి తీవ్ర గాయం అయి ఆరోగ్యం క్షీణి స్తోందని కంపెనీ యజమానుల దృష్టికి తీసుకెళ్లినా స్పందిం చడం లేదని వాపోయింది. హైదరాబాదులోని మెడికల్ సెంటర్ నిర్లక్షంగా వ్యవహరించడం వల్లనే తన కొడుకు దేశం కాని దేశంలో ఇబ్బందులు పడుతున్నాడని తెలిపింది. గల్ఫ్ జేఏసీ కన్వీనర్ రవి గౌడ్ సహకారంతో చంద్రశేఖర్ సహకారంతో అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. తన కుమారుడు స్వ గామానికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది.

హత్యకు దారి తీసిన వివాదం

- కొలనూరు హత్య కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ గజ్జి కృష్ణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్, ఆగస్టు 23: చిన్న మాటతో పెరిగిన వివాదం చివరకు హత్యకు దారి తీసిందని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. మాజీ హోంగార్డు మాటూరి విజయ్‌ను హత్య చేసిన గోదారిఖనికి చెందిన రౌడీషీటర్ పులిపాక శ్రీకాంత్ అలియాస్ పల్లె శ్రీకాంత్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్టు తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కొలనూరు హత్య కేసు ఉదంతాన్ని వివరించారు. విజయ్, శ్రీకాంత్ కుటుంబాల మధ్య ఇతర భూవివాదాలున్నాయి. ఈనెల 21న రాత్రి పది గంటలకు ఓ మద్యం దుకాణం వద్ద మాటూరి విజయ్, పులిపాక శ్రీకాంత్‌ల మధ్య ఘర్షణ జరిగింది. కేవలం మూత్రశాలలు సరిగా లేవన్నందుకే మాటూరి విజయ్, పులిపాక శ్రీకాంత్ మధ్య మాటామాటా పెరిగి, ఇద్దరు కొట్టుకున్నారు. విజయ్‌ను తోసివేయడంతో పక్కనే ఉన్న ఓపెన్ డ్రైనేజీలో పడి తలకు తీవ్ర గాయమైంది. అయినా మళ్లీ లేచి తన వద్ద ఉంచుకున్న కత్తి తీసి విజయ్‌ను పొడిచి శ్రీకాంత్ పారిపోయాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్‌ను ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లలో ఉండగానే ప్రాణాలు కోల్పోయాడు. హంతకుడు పులిపాక శ్రీకాంత్‌పై గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుతోపాటు పలు కేసులు నమోదై ఉన్నాయని, గోదావరిఖనిలో రౌడీషీటర్ మంథని సుమన్‌తో తిరిగి వారితో కలిసి హత్యకు పాల్పడ్డాడని, హత్య కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చాడని ఏసీపీ తెలిపారు. పలు నేరాలు, కేసుల నమోదు నేపథ్యంలో 14 జూలై 2020న గోదావ రిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శ్రీకాంత్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారని ఏసీపీ వివరిం చారు. హత్య కేసులో ఉన్న శ్రీకాంత్ అప్పటినుంచి తనను కూడా ఎవ రైనా ఏమైనా చేస్తారని ముం దుజాగ్రత్తగా తన వద్ద కత్తి ఉంచుకుని తిరిగేవాడని, అదే భయంతో కొంతకాలంగా తన అమ్మమ్మ ఊరైన కొలనూర్‌లో ఉంటున్నాడని, ఈ నేపథ్యంలో చిన్న మాట పట్టింపుతో మాటూరి విజయ్‌ను హత్య చేశాడన్నారు. అప్పటినుంచి ఎవరికీ దొరకకుండా గోదావరిఖని, పెద్దపల్లి రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాడని, ఇక ఇక్కడ ఉంటే పోలీసులకు దొరుకుతానన్న భయంతో శుక్రవారం కొలనూర్‌లోని తన ఇంటికి వచ్చి డబ్బులు తీసుకుని హైదరాబాద్ వెళదామనే ప్రయత్నంలో ఉన్న పులిపాక శ్రీకాంత్ గురించి తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై సిబ్బంది ఉదయం శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని, రక్తం మరకలు అంటిన దుస్తులను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు సుల్తానాబాద్ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

● సక్రమంగా విధులకు హాజరుకమ్మనందుకు..

విధులకు సక్రమంగా హాజరుకాని ఏఎన్ఎంను సక్రమంగా విధులకు హాజరుకావాలని అన్నందుకు ప్రభుత్వ డాక్టర్ హత్యకు పథకం వేశారని పెద్దపల్లి ఏసీపీ కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న మహేందర్ విధులు ముగించుకుని కారులో పెద్దపల్లికి వెళుతుండగా మార్గమధ్యలో ఏడుగురు గుర్తు తెలియని వ్యక్తులు రాడ్‌లు, కర్రలతో దాడి చేయగా డాక్టర్‌కు తీవ్ర గాయల య్యాయి. బాధితుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించగా పందిళ్ల గ్రామంలో ఏఎన్ఎంగా పని చేస్తున్న కాసిపాక విజయ కారణమని తేలింది. ఏఎన్ఎం విధులకు సక్రమంగా రాకపోగా తనకు పరిచయం ఉన్న ఎన్నం కృష్ణతో తిరిగేది. ఈ నేపథ్యంలో డాక్టర్ మహేందర్ మెమో జారీ చేస్తానని చెప్పడంతో విజయ తనకు సన్నిహితుడైన కృష్ణకు చెప్పింది. అన్నం కృష్ణ, విజయ, మరికొందరు కలిసి డాక్టర్‌ను హత్య చేయడానికి పూనుకున్నారు. బాధితుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎన్ఎం విజయతో పాటు అన్నం కృష్ణ, షేర్ల బాలాజీ, కోరడ్ల రఘువర్ధన్‌రెడ్డి, మమిడాల లావణ్‌కుమార్, హిమాయత్, దారంగుల సాగర్, బొక్కల ఆదిత్యలపై కేసు నమోదు చేసి, ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. కీలక నిందితులు విజయతోపాటు అన్నం కృష్ణ పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారని, ఈ నేపథ్యంలో తాము గంగారం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండా పట్టుబడ్డారని చెప్పారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసినట్లు శుక్రవారం సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరచనున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, సుల్తానాబాద్, పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రావణ్ కుమార్, ఓంకార్ యాదవ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు

» అవినీతి అక్రమాలపై ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ » పలు విభాగాల్లో ఫైళ్లను సీజ్ చేసి తీసుకెళ్లిన అధికారులు


రాజన్న ఆలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం రాజన్న ఆలయానికి చేరుకున్న ఏసీబీ, మెట్రాలజీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఒకే సారి పలు విభాగాల్లో సోదాలను రాత్రి 8 గంటల వరకు చేపట్టారు. శుక్రవారం ఉదయం సైతం సోదాలు కొనసాగించారు. రాజన్న ఆలయ ప్రధాన విభాగాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని అందిన పిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు పలు శాఖల అధికారులతో సోదాలు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలోని అన్నదాన సత్రం, లడ్డుల తయారీ విభాగం, గోదాం, సానిటేషన్ విభాగం, ఆడిట్ తదితర విభాగాల్లో సోదాలు నిర్వహించి ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ఆడిట్, తూనికలు కొలతలు శాఖల అధికారులతో కలిసి సమగ్ర విచారణ చేపట్టారు. ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టడంతో రాజన్న ఆలయ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఏసీబీ అధికారుల విచారణ ఎంత మంది అధికారుల మెడకు చుట్టుకుంటోందోనని ఆలయ ఉద్యోగుల్లో జోరుగా చర్చజరుగుతుంది. సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో అక్రమాలు, అవినీతి జరుగుతున్నట్లు తమకు వచ్చిన ఫిర్యాదుతో తనిఖీలు చేశామని అన్నారు. పలు విభాగాల్లో సమగ్రంగా విచారణ చేపడుతున్నామని, విచారణ పూర్తి అయిన వెంటనే నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. ఆయన వెంట ఏసీబీ సీఐలు తిరుపతి, కృష్ణకుమార్ ఆడిట్, తూకలు, కొలతల అధికారులు ఉన్నారు.

పోలీసుల పేరుతో చోరీ

- తులంన్నర బంగారు ఆభరణాలు అపహరణ

కోరుట్ల, ఆగస్టు 23: తాము పోలీసులం అంటూ కోరుట్ల పట్టణంలో శుక్రవారం ఓ వ్యక్తి వద్ద నుంచి తులంన్నర బంగారు ఆభరణాలను ముగ్గురు వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన మిట్టపల్లి భూమరాజం శుక్రవారం ఉదయం కూరగాయలు కొనేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఇందిరా రోడ్డు నుంచి వెళుతున్న భూమరాజంను గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి అతడి ద్విచక్ర వాహనానికి అడ్డంగా పెట్టాడు. ఆ వెంటనే మరో వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తాము పోలీసులమంటూ భూమరాజంతో మాట కలిపారు. గంజాయి తరలిస్తున్నావా అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అక్కడున్న మరో వ్యక్తి భయపడినట్లు నటించి తన మెడలో ఉన్న బంగారు చైన్‌ను సదరు వ్యక్తులకు అప్పజెప్పాడు. దీంతో సదరు వ్యక్తులు భూమరాజంను కూడా తన మెడలో ఉన్న బంగారం ఇవ్వు అంటూ బెదిరించారు. ఇంతలోనే సదరు వ్యక్తులు భూమరాజం చేతిపై స్ప్రే చేసి మెడలో ఉన్న చైన్‌తో పాటు చేతికి ఉన్న ఉంగరాన్ని తీసుకుని ఆ ముగ్గురూ కలిపి అక్కడి నుంచి పారిపోయారు. కాసేపటికి తెరుకున్న బాధితుడు బంగారు చోరీకి గురైనట్లు గుర్తించి విషయం వెంటనే పోలీసులకు తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్, 2వ ఎస్ఐ శ్వేత తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులు ఇచ్చిన సమాచారంతో తనిఖీ నిర్వహించారు. సమీప ప్రాంతాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి అనుమానితుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. భూమరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


సీసీ పుటేజీలో పోలీసులు సేకరించిన చిత్రం

నిధుల దుర్వినియోగం కేసులో ఇద్దరి రిమాండ్

తిమ్మాపూర్, ఆగస్టు 23: మండలంలోని ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగంపై ఎల్ఎండీ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విధుల నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల జీతాలు సుమారు 10లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు దీనికి అదే పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి తిరుమలతో పాటు ఆమె భర్త కెరాజ్‌కుమార్‌ను బాధ్యులని ఈ ఏడాది ఏప్రిల్ 5న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో తన సంతాకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు చాలాన్లు సృష్టించి ట్రెజరీలో సమర్పించారని వివరించారు. అకౌంట్ నంబర్లు మార్చడం, ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపుల రికవరీ పేరిట తనకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న ఎల్ఎండీ పోలీసులు 420కేసుతో పాటు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం జి తిరుమలతో పాటు రాజ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

రూ.4.92లక్షల మాయం.. కేసు నమోదు

మానకొండూర్, ఆగస్టు 23: మానకొండూర్ మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన నెమ్మది ప్రశాంత్ అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా శుక్రవారం లింకు వచ్చింది. దీంతో ప్రశాంత్ ఆ లింకును ఓపెన్ చేయడంతో అతని బ్యాంకు ఖాతా నుంచి నాలుగు లక్షల 92వేలు మాయం అయ్యాయి. కాగా బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలలని సీఐ సూచించారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

మంథని, ఆగస్టు 23: స్థానిక అంబేద్కర్ చౌక్ సమీపంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న చకిలం కృష్ణమూర్తి అండ్ సన్స్ ఫర్టిలైజర్ షాపులో గురువారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. షాపు ఓనర్ చకిలం శ్రీనివాస్ రోజువారీగా రాత్రి షాపునకు తాళం వేసుకొని ఇంటి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచిచూడగా తన షాపులో చోరీ గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. షాపు వెనుక భాగంలో ఉన్న కిటికీ స్క్రూలను దొంగ తొలగించి షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.2వేల నగదు, సీసీ కెమెరాల మానిటర్‌ను ఎత్తుకొని వెళ్లాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ మేరకు బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన కేసులో హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామానికి చెందిన దొంత మైసయ్యకు 2,817 రూపాయల జరిమానా లేదా ఒక నెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ జిల్లా ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ తీర్పు వెలువరించారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. నిందితుడిపై 2019 సంవత్సరం జనవరి 31న, అదే సంవత్సరం ఆగస్టు 20న విద్యుత్ చౌర్యం కేసులు నమోదయ్యాయని తెలిపారు.

అంబులెన్స్ బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన అంబులెన్స్

తంగళ్లపల్లి, ఆగస్టు 23: మండలంలోని బద్దెనపల్లి శివారులో ప్రమాదవశాత్తు అంబులెన్స్ బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వేములవాడ పట్టణానికి చెందిన శేఖర్ కుడి కాలు విరగడంతో హైదరాబాదులో వైద్య చికిత్స పొంది అంబులెన్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో అంబులెన్స్ బద్దెనపల్లి శివారులో ప్రమాదానికి గురై బోల్తా పడింది. దీంతో శేఖర్ ఎడమ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అంబులెన్స్ డ్రైవర్ శివ స్వల్పంగా గాయపడ్డాడు. కాలు విరిగి చికిత్స చేయించుకొని మరో 15 నిమిషాల్లో శేఖర్ ఇంటికి చేరుకుంటాడు అనుకుంటున్న క్రమంలో దురదృష్టం వెంటాడి ప్రమాదంలో మరో కాలు విరిగి తీవ్రంగా గాయపడడం పలువురిని కలిచి వేసింది.

ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 23: శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెం గ్రామానికి చెందిన చల్ల కనకయ్య శుక్రవారం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. కనుకయ్య తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పెట్రోలింగ్ పోలీసులు 108కు సమాచారం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 23: జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి ఎర్ర శ్రావ్యను భర్త అశోక్‌తో పాటు అత్తా, మామ కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావలని వేధిస్తున్నారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తతో పాటు అత్త రాజేశ్వరి, మామ సారయ్య నాలుగు లక్షల రూపాయల అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని బాధితురాలు పిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్ స్పెక్టర్ రవి తెలిపారు.

మూడు వేర్వేరు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23: మూడు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష విధించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ మెమోరీ కార్డులో నీలిచిత్రాలు నింపి అమ్మిన సెల్ పాయింట్ యజమాని ఆడెపు రాజుకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానాను సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎ ప్రవీణ్ విధించారని అయన తెలిపారు. సెల్ పాయింట్ యజమాని సిరిసిల్ల పట్టణం సుందరయ్య నగర్‌కు చెందిన ఆడెపు రాజు అనే వ్యక్తి మొబైల్ ఫోన్‌లో రీచార్జితో పాటు, అధిక లాభాలు ఆర్జించాలనే దురుద్దేశంతో తన యొక్క కంప్యూటర్‌లో నీలి చిత్రాల వీడియోలు డౌన్లోడ్ చేసి తన వద్దకు వచ్చే కస్టమర్లకు మొబైల్ ఫోన్ మెమోరీ కార్డుల్లో నింపి డబ్బులు సంపాదించాడన్నారు.హత్యాయత్నం కేసులో రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల బాలకిషన్, రాగులు దేవయ్య , రాగుల రఘు అనే ముగ్గురికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.100 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. మరో హత్యాయత్నం కేసులో రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల వెంకటేష్, రాగుల కొండయ్య , రాగుల నరసయ్య, మర్రి తిరుపతి అనే నలుగురిపై నేరం రుజువు కావడంతో ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా విధిస్తు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ తీర్పు చెప్పారన్నారు. మూడు కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన పీపీలు గడ్డం లక్ష్మణ్, టి పవన్, చెలుముల సందీప్, ఎస్ఐ రవీంద్రనాయుడు, కోర్ట్ కానిస్టేబుల్‌లు నరేష్, శ్రీనివాస్, కానిస్టేబుల్స్ మధుసూదన్, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్ఐ అశోక్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

బస్‌స్టేషన్‌లో ల్యాప్‌టాప్ మరిచిపోయిన ప్రయాణికుడు


ల్యాప్‌టాప్‌ను డిపో అధికారులకు అప్పగిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని ఒక ప్రయాణికుడు తన ల్యాప్‌టాప్‌ను మరిచిపోయాడు. బస్‌స్టేషన్‌లోని హోటల్‌లో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను గుర్తించిన ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే ఆ ల్యాప్ టాప్‌ను ఆర్టీసీ డిపో-1 క్లర్క్‌కు అందించారు. హెచ్‌పీ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్ ఖరీదు లక్ష రూపాయల వరకు ఉంటుందని అంచనా. కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ ఎస్ఐ ఎం లక్‌పతి, కానిస్టేబుల్ రమణ, నారాయణ పాల్గొన్నారు.

అధికారుల తనిఖీలు

చొప్పదండి, ఆగస్టు 23: సాంఘిక సంక్షేమ పాఠశాలల తనిఖీలో భాగంగా శుక్రవారం చొప్పదండిలోని జిల్లాపరిషత్ ప్రాథమిక పాఠశాల, రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సన్నబియ్యం నాణ్యత, ఆహారాన్ని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం రజనీకాంత్ తనిఖీ చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది మజారుద్దీన్, సాయికుమార్ ,ప్రధనోపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యాకర్తలు పాల్గొన్నారు.


ధర్మపురి మహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు


మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురిలో భక్తుల రద్దీ

- ఆలయాల్లో అమ్మవారలకు కుంకుమ పూజలు

ధర్మపురి, ఆగస్టు 23: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మూడవ శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు కుంకుమ పూజలు, ఉద్యాపన పూజలు జరిపారు. అనేక మంది భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాంకిషన్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా లక్ష్మీ హవనం నిర్వహించారు.

పాకాలవాణికుంటకు బుంగ

-తాత్కాలిక మరమ్మతులు చేసిన అధికారులు

ఇల్లంతకుంట, ఆగస్టు 23: మండలంలోని రేపాక గ్రామంలోని పాకాలవాణికుంటకు శుక్రవారం బుంగపడింది. ఇటీవల కురిసిన వర్షాలతో పాకాలవానికుంట నిండింది. మత్తడి సమీపంలోని కట్టకు బంగపడటంతో నీరు వృధాగా వెళ్లిపోవడాన్ని చూసిన మాజీ ఎంపీటీసీ కాత సుమలతమల్లేశం సమస్యను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డీఈ శ్రీనివాస్, ఏఈ రాధిక కుంటవద్దకు చేరుకొని ఎక్స్‌కవేటర్ సహాయంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.


పాకాలవాణికుంట నుంచి వెళుతున్న నీరు

ముంపు గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దు



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

గంగాధర, ఆగస్టు 23: ముంపు గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. గంగాధర మండలం గర్షకుర్తిలో శుక్రవారం ముంపు గ్రామాల రైతులతో ఆర్డీవో గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కాళేశ్వరం లింకు ప్రాజెక్టు ఎత్తిపోతల్లో 1.1 టీఎంసీ కాలువ నుంచి డీ4 కాలువ కింద గర్షకుర్తి, ఉప్పరమల్యాల గ్రామాల రైతులకు చెందిన 17 ఎకరాలు పోతుందన్నారు. వ్యవసాయ భూమితో పాటు చెట్లు, బావులు, ఇతర వ్యవసాయ పైపులైన్లు తప్పి పోయిన రైతులు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. తప్పిపోయిన భూములు, బావులు, చెట్లు తదితరాలకు ప్రభుత్వ పరంగా పరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమానికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, డీఈ విష్ణు ప్రసాద్, గర్షకుర్తి, ఉప్పరమల్యాల రెవెన్యూ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్నకు ఉడకని నైవేద్యం

- తప్పతాగి విధులకు హాజరైన వంట మనిషి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి ఉడకని నైవేద్యాన్ని శుక్రవారం సమర్పించారు. స్వామి వారికి నిత్యం ఉదయం 11.30 గంటలకు జరగాల్సిన నివేదన అరగంట ఆలస్యమైంది. స్వామి వారి నివేదన సమయంలో నైవేద్యం ఏర్పాటు చేసే వ్యక్తి తప్పతాగి విధులకు హాజరుకావడంతో ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఆగమేఘాల మీద సదరు వ్యక్తి వంటకాలు చేయడంతో మాడిపోయాయి. దీంతో చేసేదేమీ లేక ఉడికీ ఉడకని నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఆగస్టు23: ఎస్‌బీఐ ఆర్‌సెటీలో ఆగస్టు 30వ తేదీ నుంచి పురుషులకు రిఫ్రిజిరేషన్ అండ్ ఏయిర్‌కండిషనర్‌లో 30రోజుల పాటు ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల వారు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9849411002, 798115 1653 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్

మెట్‌పల్లి, ఆగస్టు 23(ఇబ్రహీంపట్నం): ఉద్యోగులకు, ఉపాధ్యాయుల కుటుంబాలకు గొడ్డలి పెట్టులాంటి నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌యూ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యామ్ సుందర్ డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టీఎస్‌యూ టీఎఫ్ నాయకులు పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాల సంరక్షణకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అయిటి సుశీల, ప్రధానోపాధ్యాయులు బెజ్జరపు మురళి, ఉపాధ్యాయులు యాద గిరి, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయికల్: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ మండలంలోని మైతా పూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. సీపీఎస్ వల్ల నష్టం జరుగుతుందని, పాత పెన్షన్‌ను పునరుద్ధరించి ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మేలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కార్యదర్శి అంతడుపుల గంగరాజం, మధు, కార్తీక్, గంగరాజం, గిరిధర్ పాల్గొన్నారు.

పెగడపల్లి : రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య కోరారు.



రాయికల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



మెట్‌పల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులచే తపస్ సభ్యత్వ నమోదు చేయించిన అనంతరం దేవయ్య మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, 317 జీవో ఉపాధ్యాయులను వెంటనే తమ జిల్లాలకు పంపాలని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి బీఈడీ, డీఎడ్ చేసిన సెకండరీ గ్రేడ్ వారితో కామన్ సీని యారిటీతో భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలకు వెంటనే జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్, మండల అధ్యక్షులు నేదరి లక్ష్మణ్, గంగాధర మల్లేశం పాల్గొన్నారు.

మల్లాపూర్ : కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని టీఆర్‌టిఎఫ్ మండల శాఖప్రధాన కార్యదర్శి మద్దెల రాజరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మల్లాపూర్‌లో సంఘ నాయలకులు ఉపాధ్యాయులతో కలిసి ఆయన ప్రభుత్వం అవలంబిస్తున్న సీపీఎస్‌పై నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో సురేష్, మహిపాల్, రామన్, గణేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా అటవీ శాఖాధికారి



కలెక్టర్ సత్యప్రసాద్‌కు పూలమొక్కను అందిస్తున్న డీఎఫ్‌వో

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మాదాసు సత్యప్రసాద్ శుక్రవారం కలెక్టర్ సత్య ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పూలమొక్కను అందించారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్ రెడ్డిలను సైతం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు డివిజన్, ఇతర అధికారులు షౌకత్ అలీ, పద్మారావు, గులాం మోయినోద్దిన్, భూమేశ్, శ్రీనాథ్, అరుణ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధన విజయాలపై అవగాహన

పెగడపల్లి, ఆగస్టు 23 : మండలంలోని బతికెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన విజయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024ను పురస్కరించుకుని ఐఎఫ్‌పీ ద్వారా ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ రూపొందించిన 15 నిమిషాల వీడియో, ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా రూపొందించిన 30 నిమిషాల వీడియో లింక్ ద్వారా మాడ్యూల్స్ ద్వారా చంద్రయాన్ విశేషాలను తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం అంతరిక్ష విజయాలపై క్విజ్, స్పేస్‌కు సంబంధించిన అంశాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్. మంజుల పాల్గొని కార్యక్రమం ఉద్దేశ్యాన్ని పిల్లలకు వివరించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీధర్ పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారికి వీడ్కోలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 23 : మండల వ్యవసాయాధికారిగా 11 సంవత్సరాలు విధులు నిర్వహించిన షాహీద్ ఆలీని రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు చేసిన సేవలను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఏవో షాహీద్ ఆలీ మాట్లాడుతూ 11 ఏళ్లుగా ఇక్కడ సేవ చేసేలా అవకాశం కలిగిందని, తనకు సహకరించిన రైతులకు, ఏవో, ఏఈవోలతో పాటు ఫర్టిలైజర్ దుకాణందారులకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇబ్రహీంపట్నం నుంచి బదిలీపై మెట్‌పల్లి ఏవోగా బాధ్యతలు స్వీకరించిన దీపికను శాలువా, పుష్ప గుచ్చాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల క్రీడల నిర్వహణపై సమావేశం



పీఈటీలతో సమావేశమైన ఎంఈవో

రాయికల్, ఆగస్టు 23: మండలంలోని పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడల నిర్వహణపై ఎంఈవో గంగాధర్ పీఈటీలతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 2న అండర్-14, 17 విభాగాల్లో బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 3న అండర్-14, 17 బాల, బాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించడానికి తేదీలను ఖరారు చేశామన్నారు. అండర్-14 బాల, బాలికలు 01-01-2011, అండర్-17 బాల, బాలికలు 01-01-2008 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. అండర్-14 కబడ్డీ బాలికల బరువు 48 కిలోలు, అండర్-14 బాలురు 51 కిలోల బరువు, అండర్-17 బాల, బాలికలకు 55 కిలోల బరువులోపు ఉన్నవారు అర్హులన్నారు.

ఈ క్రీడల్లో పాల్గొనే బాల, బాలికలు తప్పనిసరిగా పాఠశాల నుంచి పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాన్ని సంబంధిత ప్రధానోపాధ్యాయుల సంతకంతో సమర్పించాలన్నారు. వివరాలకు మండల కన్వీనర్, పీడీ కృష్ణప్రసాద్‌ను 9440037393లో సంప్రదించాలని తెలిపారు.

28 నుంచి పాఠశాల ఆటల ఎంపిక పోటీలు

మల్యాల, ఆగస్టు 23: ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు మండల స్థాయి పాఠశాల ఆటల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో అయిత శ్రీనివాస్ తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు సంబంధించి 28న బాలికలకు, 29న బాలురకు తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొనవచ్చునని ఆయా పాఠశాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహించాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వప్రసాద్, బాబా లక్ష్మి, గంగసాగర్, నవీన్ ఉన్నారు.

బీఆర్ఎస్ బూటకపు ధర్నాలు మానుకోవాలి

● ప్రకటించిన ప్రకారం రుణమాఫీ రైతులకు అందుతుంది ● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, ఆగస్టు 23 : బీఆర్ఎస్ నాయకులు బూటకపు ఆందోళనలు.. ధర్నాలు మానుకోవాలని.. ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన రైతులకు రుణమాఫీ అందుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి కృష్ణారావు మాట్లాడారు. రుణమాఫీ అయిన వారు ధర్నాలో కూర్చోవడం ఏమిటని ప్రశ్నించారు. సాంకేతిక లోపాలతో కొన్ని బ్యాంకులలో సరైన రిపోర్టు రాకపోవడంతో వాటి సవరణ సరిగా చేయాలని ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకర్లకు ఆదేశాలను జారీ చేసిందని బీఆర్ఎస్ నాయకులు గమనించాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు చేసిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. రుణమాఫీ పొందిన కల్లూర్ మాజీ సర్పంచ్ వంతడుపుల అంజయ్య, మాదాపూర్ సర్పంచ్ దారిశెట్టి రాజేష్‌లతో పాటు పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌ల భర్తలు ధర్నాలో పాల్గొవడం విడ్డూరమని వారికి అందిన రుణమాఫీ పత్రాలను కాంగ్రెస్ నాయకులు ప్రదర్శించారు. సొగ్రభీ, సత్యనారాయణ గౌడ్, సంగలింగం, గంగాధర్, అజయ్, నర్సయ్య, ఫహీం పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

జ్వరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



కథలాపూర్‌లో సూచనలు చేస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

కథలాపూర్, ఆగస్టు 23 : ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు విజృంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న జ్వర సర్వే తీరును పరిశీలించారు. పలు ఇళ్లల్లోకి వెళ్ళి నీరు నిల్వ ఉన్న పాత్రలను గమనించి నిల్వ ఉంచుకోవద్దని దీంతో లార్వా వృద్ధి చెంది దోమల బెడద తీవ్రమవుతుందని వివరించారు. తాగునీరు కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, డెంగీ, అతిసారం వంటి వ్యాధులు విజృంభిస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సింధూజ, సూపర్‌వైజర్ శ్రీధర్, సీహెచ్‌ఓ సుగుణ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి-

కొడిమ్యాల : సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలోని డ్రై డే కార్యక్రమంలో బాగంగా శుక్రవారం పిచ్చి మొక్కలను, వైద్య అధికారులు సిబ్బంది తొలిగించారు. అనంతరం మెడికల్ ఆఫీర్ పరమేశ్వరీ మాట్లాడుతూ సీజనల్ వ్యాదులు చికెన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడకుండ విద్యార్థులకు అవగాహన కలిపించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారణకు విద్యార్థులకు అవగాహన కలిపించారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, మండల వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, ఏపీవో సతీష్, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, పంచాయతీ సెక్రటరీ వంశీవర్ధన్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన రుణమాఫీ దరఖాస్తులు

కథలాపూర్, ఆగస్టు 23 : వివిధ కారణాలతో రెండు లక్షల లోపు రుణ మాఫీ కాని రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తులు సమర్పించాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో కథలాపూర్‌లో రైతులు బారులు తీరారు. రైతు వేదికలో ఏఈఓలు సుష్మశ్రీ, సంధ్య వివిధ గ్రామాల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రేషన్ కార్డు లేని వారు, భర్త పాసుపుస్తకంతో రుణం పొందిన భార్యలు, కొన్ని ఏళ్ల నుంచి రుణ బకాయిలు ఉన్న వారికి సంబంధించిన రైతుల నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఏఈవోలు తెలిపారు. రెండు లక్షల పైబడి రుణాలు ఉన్న రైతులు తాము బ్యాంకుల్లో డబ్బులు చెల్లిస్తామని అధికారులకు వివరించారు. అయితే తమకు ఎలాంటి సమాచారం ప్రభుత్వం నుంచి రాలేదని ఏఈవోలు పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమానికి చేయూత అందించాలి

సిరిసిల్ల రూరల్, అగస్టు 23: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందించడంతోపాటు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన బోర్డులో కార్మికుల ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ప్రభుత్వం కొనసాగించాలని సీఐటీయూ బిల్డింగ్ అధార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం సీఐటీయూ బిల్డింగ్ అధార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మికుల సంక్షేమ బోర్డును అధికారులు నిర్లక్ష్యం వల్ల బోర్డుకు రావాల్సిన నిధులు పక్కదారి పడుతున్నాయని అన్నారు. కార్మికులకు రావాల్సిన క్లైయిమ్స్‌లను సకాలంలో చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు బోర్డులోని ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ప్రభుత్వం నుంచి తొలగించి ప్రైవేటు సంస్థకు అప్పగిస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకోని కార్మికుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని బోర్డులోనే ఇన్సూరెన్స్‌ను కొనసాగించాలని లేని పక్షంలో ఈ నెల 28న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని ప్రకటించారు. అయిన ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో ఆందోళనలు, పోరాటాలు చేపడుతామన్నా రు.

జీవనోపాధులకు ఊతం 'మహిళాశక్తి'..

● ఆర్థిక స్వావలంబనకు కొత్త పథకాల ఊరట ● గ్రౌండింగ్ ప్రక్రియ వేగవంతం



మండలంలోని స్త్రీశక్తి భవనం

కథలాపూర్, ఆగస్టు 23 : గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న మహిళలను సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి ఆర్థిక చేయూత అందించాలని ప్రభుత్వం తాజాగా మహిళాశక్తి పేరిట నూతన పథకం ఆరంభించింది. ఇంతకాలం మార్కెటింగ్‌పై మార్గనిర్దేశనం లేక సాంకేతిక పరిజ్ఞానం అందక మహిళలు వ్యాపారాల్లో వెనబడి పోవడం పట్ల సర్కారు వారికి ఆర్థిక స్వావలంబన అందించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలను శాఖ అధికార యంత్రాంగం ఇప్పటికే మహిళ సంఘాలకు అవగాహన కల్పించి యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభించారు

● గ్రామైఖ్య సంఘాలతో సమావేశాలు ముమ్మరం

మహిళా ఉన్నతి కోసం కొత్తగా ప్రవేశపెట్టనున్న పథకాలకు సంబంధించిన గ్రౌండింగ్ ప్రక్రియ కోసం మహిళా సంఘాలతో సమావేశాలు ముమ్మరం చేశారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీతో రుణ సదుపాయం కల్పించాలని ఉద్దేశించారు. పాడి పరిశ్రమన ఏర్పాటు చేయడానికి ముర్రా జాతి గేదేలను కొనుగోలు చేయడానికిగాను రు. 75 వేల రుణం అందించనున్నారు. పశువుకు బీమా సదుపాయం కల్పించనున్నారు. అదేవిధంగా పెరటి కోళ్ల పరిశ్రమ ఏర్పాటులో భాగంగా మదర్ యూనిట్‌కు రు. 3 లక్షల రుణం అందించనున్నారు. మదర్ యూనిట్ నుంచి మహిళా సంఘాల సభ్యులు అవసరమైన మేర కోడి పిల్లలను రుణ ప్రాదిపదికన అందించనున్నారు.

● మిల్క్ పార్లర్ల యూనిట్ల ఏర్పాటు

స్వయం సహాయక సంఘాల మహిళలు షాపింగ్ మాల్స్, రైల్వే స్టేషన్, సినిమా హాళ్ల వంటి ప్రాంతాల్లో మిల్క్ పార్లర్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చనే ఉద్దేశ్యంతో రు. 2 లక్షల రుణం అందించనున్నారు. మహిళా క్యాంటిన్లు, కుట్టు శిక్షణ కేంద్రాలకు రుణం ఇవ్వనున్నారు. సౌర విద్యుత్ యూనిట్ స్థాపనకు రు. 4 కోట్లు రుణం అందించి అందుల్లో 10 శాతం లబ్దిదారుల మార్జిన్ మనీ ఉండనుంది. దీంతో 25 సంవత్సరాల్లో రు. 5 కోట్ల మేర లాభం ఆర్జించడానికి అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

● మహిళలకు భవిష్యత్‌లో భరోసా
నరహరి, ఏపీఎం సెర్ప్

ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న పథకాలు రానున్న రోజుల్లో మహిళలకు ఆర్థికంగా భరోసా కలగడానికి అవకాశం ఉంది. యూనిట్ల స్థాపన కోసం ఇప్పటికే గ్రామాల్లో లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. మండలంలో సుమారు 200 యూనిట్లను స్థాపించాలనే లక్ష్యం నిర్ణయించాం. ఈ మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు వేగిరం చేశాం.

సంక్షిప్తం సమాచారం

ఘనంగా రాజరాజేశ్వరస్వామి కల్యాణం

కథలాపూర్, ఆగస్టు 23 : మండలంలోని ఇప్పపల్లిలో శుక్రవారం శ్రీరాజరాజేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎనుగంటి పరివారం ఆధ్వర్యంలో ఈ జాతర నిర్వహించగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్థానిక అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కాగా ఎమ్మెల్యేను జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ శాలువాతో సత్కరించారు.

ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు

కొడిమ్యాల, ఆగస్టు 23 : మండలంలోని సంద్రల్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏనుగు ఆదిరెడ్డి ఇటీవల సోషల్ ప్రమోషన్‌పై స్కూల్ అసిస్టెంట్‌గా మండలంలోని తిర్మలాపూర్ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. శుక్రవారం బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయునికి గ్రామస్తులు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఆయన పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి మంద లింగవ్వ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు అశోక్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ఎండపల్లి, ఆగస్టు 23: మండలంలోని మారేడుపల్లి గ్రామంలోని క్రషర్‌పై చర్యలు తీసుకోవాలని జగిత్యాల లేబర్ అధికారికి దళిత బహుజన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం గురువారం వినతిపత్రం అందజేశారు. జగిత్యాలలోని లేబర్ ఆఫీసర్‌తో కలిసి చర్చించారు. కొద్ది రోజుల క్రితం ప్రొక్లైన్ డ్రైవర్ క్రషర్‌లో పడి మరణించాడని, ప్రమాదమని తెలిసినా వలస కార్మికుడితో పని చేయించారని పేర్కొన్నారు. మృతి చెందిన వ్యక్తి 17 ఏళ్ల బాలుడని, ప్రొక్లెయిన్‌కి కూడా సరైన ఇన్సూరెన్స్ లేదని అతడి కుటుంబానికి 30 లక్షలు ఇప్పించాలని కోరినట్టు కైలాసం తెలిపాడు.

పద్మశాలి సంఘ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

కోరుట్ల, ఆగస్టు 23 : పట్టణ పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘ నూతన కార్యవర్గ ఎన్నికకు శుక్రవారం ప్రకియ ప్రారంభం అయింది. అధ్యక్ష పదవితో పాటు వివిధ పదవుల కోసం పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారులు అందే శివ ప్రసాద్, బోగ శ్రీధర్ కుమార్ నామినేషన్లను స్వీకరించారు. అధ్యక్ష పదవికి గుంటుక ప్రసాద్, గుడ్ల మనోహర్, అడెపు నరేష్, ఉపాధ్యక్ష పదవికి కటకం వినయ్ కుమార్, ఎక్కలదేవి నవీన్ ప్రదాన కార్యదర్శి పదవికి బండ్ల రవీకుమార్, సహాయ కార్యదర్శి పదవికి గోసికొండ కుమార స్వామి, కార్యవర్గ సభ్యుల కోసం మార్త మహేందర్, గాజుల మధు యువజన అధ్యక్ష పదవికి జక్కుల ప్రవీణ్ కుమార్ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

జగిత్యాలరూరల్, ఆగస్టు 23 : పట్టణంలోని వాణినగర్ గీతావిద్యాలయం తోపాటుగా, రూరల్ మండలంలోని పొలాస శ్రీలలితఅమ్మవారి ఆలయంలో శుక్రవారం 3వ శుక్రవారం పురష్కరించుకొని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించి ప్రత్యే క పూజలు చేశారు.

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేట శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా పలువురు మహిళలచే సామూహిక కుంకుమ పూజలను అర్చక బృందం భక్తి శ్రద్ధలతో జరిపించారు. సాయంకాలం ప్రత్యేకపూజల అనంతరం ఆలయంలో మమిళలచే విశిష్టపూజలను, అభిషేకార్చనలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అంతర్గాం విద్యార్థులు

జగిత్యాలరూరల్, ఆగస్టు 23 : జగిత్యాల రూరల్ మండలంలోని అంర్గాం పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు పూజ, కీర్తనలు ఎంపికయ్యారు. ఈనెల 25వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థినులు పోటీల్లో ఆడనున్నారు. విద్యార్థినులను భూపతిరావు, సరోజన, అనిత, రజనీకర్‌రెడ్డి, రాజేందర్, ఫక్రుద్దీన్, పీడి కోటేశ్వర్‌రావు అభినందించారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

రాయికల్, ఆగస్టు 23: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పౌర సరఫరాల శాఖ నాయబ్ తహసీల్దార్ వరప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అలాగే మండలంలోని ఉప్పుమడుగు, అయోధ్య గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.

విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు

రాయికల్, ఆగస్టు 23: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అంతరిక్షానికి సంబంధించిన బొమ్మలు వేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, రంగోళి, నమూనా తయారీ అంశా ల్లో పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వేముల మధు, అంతడుపుల గంగరాజం, కార్తీక్, గిరిధర్, గంగరాజం, నర్సయ్య పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాయికల్, ఆగస్టు 23: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌లు అన్నారు. పట్టణంలోని పలు వార్డులలో డ్రై డే సందర్భంగా ప్రతి ఇంటి ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తూ, యాంటీ లార్వా మందును పిచికారి చేయించారు. అలాగే ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటి, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ

మల్లాపూర్, ఆగస్టు 23 : రైతులందరి దైవము ఆ బలరాముడే అని భారతీయ కిసాన్ సంగ్ రైతులు అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లో గల రైతు వేదిక వద్ద పలువురితో కలిసి బలరాముని విగ్రహ నిర్మాణానికి భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. విగ్రహ నిర్మాణ పూజలో జలపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగరాజం, రైతులు పాల్గొన్నారు.